



కిటికీలోంచి విందు జాబిల్లి తెల్లగా నవ్వుతూ హృదయానికి గిలిగింతలు పెడుతూన్న సమయంలో, ...వుదుండి వీస్తూన్న గాలి తెమ్మెరలు చల్లగ వచ్చి తల్లిలా శరీరాన్ని నిమురుతుంటే, గుమ్మంలో జాజిపందిరి గుబాళిస్తు మనస్సుకి మత్తెక్కిస్తూన్న మధురక్షణంలో, సన్నని వేణుగానం ఒకటి గాలి అలలమీద అలవోకగా అలా అలా తేలిపోతూ జాజుల పరిమళంలో మధురంగా కలిసిపోతూ, లీలగా వినిపించింది సంధ్యకి.

అంత మృదువైన మురళి, గుండెల్ని పులకింప జేసే మంద్ర స్థాయిలో మనోహరంగా వినిపించేసరికి చల్లని పన్నీటి సెల యేటిలో స్నానమాడినట్లు సంధ్యకి ఒళ్లంతా ఒక్కసారి ఝల్లుమంది.

ఎన్ని జన్మల క్రితమో విన్నట్లుంది— ఆ పాట!

ఆత్మీయంగా పలకరిస్తూ గుండెలచుట్టూ సుడులు తిరుగుతోంది. ఆ పాట విన్నకొద్దీ సంధ్య తనలో తాను చలించిపోతూ తన్మయురాలై పోతోంది. సన్నగా వినిపిస్తూన్న ఆ పాట, హృదయాన్ని వెన్నెల తీగలతో ముడివేసి, తనవేపు లాక్కుంటున్నట్లు అనిపించి, ఆ సుఖ పారవశ్యంలో 'అబ్బ' అని గట్టిగా మూలిగింది.

మధురంగా ఆ పాట ఇంకా వినిపిస్తూనే వుంది.

సంధ్య ఇంక ఒక్కక్షణం వుండలేక మంచం దిగింది. కాళ్ళు ఆమెకి తెలియకుండానే వీధి కిటికీ దగ్గిరికి తీసుకు వెళ్ళాయి. బయటికి చూస్తే పాలు ఒలకబోసినట్లు వెన్నెల తెల్లగా స్వచ్ఛంగా మెరిసిపోతోంది. పిల్లనగ్రోవి పాటలో తనలాగే ఆ వెన్నెల కూడా పులకించిపోతున్నట్లుంది.

ఎవరబ్బా ఇంత తియ్యగా పాడుతున్నారు!

లోకం అంతా నిండిపోయిన ఆ పాట, అసలు వస్తూన్నది ఎక్కడనుంచో సంధ్యకేమీ అర్థం కాలేదు. నాలుగు దిక్కులూ నిండిపోయిన ఆ పాట ప్రత్యేకం ఈ దిక్కు నుంచి వస్తోందని ఎలా నిర్ణయించడం? మనుష్యుల కెవరికీ అనువుగాని ఈ అమర గానం స్వర్గం నుంచి వినిపిస్తోందా మరయితే? సంధ్య తన్మయురాలై అరచేతిని చెక్కిలికి చేర్చుకొని అరమోడ్పు కన్నులతో కిటికీ దగ్గర ఆ మట్టునే నిలబడి వినసాగింది.

"సంధ్యా!"

ఉలిక్కిపడింది సంధ్య. సంగీత లోకంలోంచి మామూలు ప్రపంచంలోకి వస్తూ "పిలిచారా?" అంది పరధ్యానంగా.

"అర్ధరాత్రి వేళ ఏమిటి వెళ్ళి అక్కడ నిలబడ్డావు!" ఆందోళనలో కూడిన అధికార స్వరంతో ప్రశ్నించాడు రాజు. సంధ్య మంచం దగ్గిరికి తిరిగి నడిచి వస్తూ "ఎవరో మురళి చాలా బాగా వాయిస్తున్నారండీ" అంది చెప్పలేనంత ఉత్సాహంతో దూరంనుంచి వినిపిస్తూన్న ఆ గానాన్ని ఇంకా తన్మయస్థితిలోనే వింటూ.

"చాల్లే సంతోషించాం. ఇంక పడుకో, పన్నెండు దాటింది" అంటూ అటు ఒత్తిగిలాడు రాజు. మంచంమీద మిగిలిన ఆ కొంచెం చోటులోనూ ఒదిగిపడుకుందన్న మాటే కాని రాత్రి తెల్లవార్లూ సంధ్యకి కలలో ఆ మురళీరవమే ఉండుండి వినిపించి కదిలించి వేయసాగింది.

మర్నాడు నిద్రలేచాక భర్తకి సేవలు చెయ్యడం, ఇంటిపనుల్లో మునిగిపోవడం, క్షణం తీరికలేకపోవడం ఆ కారణంగా రాత్రి విన్న సంగీతం సంగతే జ్ఞప్తికి రాలేదు సంధ్యకి. ఆ తర్వాత రెండు మూడు రోజులదాకా మళ్ళీ ఆ మురళి వినిపించలేదు. సంధ్యా మరిచిపోయింది ఆ సంగతి.

ఒకరోజు సాయంత్రం ఇంటి పను లన్నీ పూర్తిచేసుకుని మొహం రుద్దుకుని

బొట్టూ కాటుకా పెట్టుకొని తల్లో సన్న జాజులు ముడుచుకొని చాకింటి తెల్లచీర కట్టుకొని రాజు రాకకోసం వేయి కన్నులతో వేచియున్న సంధ్యకి ఉన్నట్టుండి ఆ నాటి మురళీగానం తిరిగి వినిపించింది.

మళ్లీ అదే మాధుర్యం.

అంతే మంద్రస్థాయిలో సాగుతున్న వేణుగానం.

గుండెల చుట్టూ సుడులు తిరుగుతూ మనస్సులో అలలు అలలుగా అలజడి రేపే అమర సంగీతం.

ఆ వేణువు వినేవరికి సంధ్య కొంతసేపు తనను తాను మరిచి ఆ పాట వింది. తర్వాత స్థిమితంగా ఒకచోట ఉండలేక పోయింది. గదులన్నీ కలయదిరిగింది. ఏ గదిలోకి వెళ్ళినా ఆ పాట తనని అనుసరిస్తూనే వుంది. తియ్యగా వచ్చి పలకరిస్తూనే వుంది. ఇంతకీ ఎక్కడనుంచి వస్తూన్నట్టు ఆ పాట? ఎవరు పాడుతున్నారు?

సంధ్య ఇంక వుండలేక వీధి తలుపు తెరుచుకొని అరుగుమీదకి వచ్చింది. ఇటూ అటూ చూసింది. వీధిలో ఎవ్వరూ కనిపించలేదు. మరైతే ఎక్కడనుంచి వస్తూన్నట్టు ఈ సంగీతం. ఎదురింటివైపు చూసినప్పుడు అర్థమైంది సంధ్యకి ఆ పాట వస్తూన్నది ఎదురింట్లోంచే అని. ఆ ఇంట్లో ఎవరున్నారు చెప్మా. మొన్నటిదాకా ఖాళీగా ఉండే ఆ యిల్లు. ఈ మధ్యనే ఎవరో ఆఫీసరు కొత్తగా వచ్చి వంటరిగా వుంటున్నారన్నారు ఆ ఇంట్లోనే నేమిటి.

సంధ్య ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ ఆ పాట ఉన్నట్టుండి ఆగి, వెంటనే మరో రాగంలోకి మారి జాలిగా వినిపించ సాగింది. ఆ పాటవింటూ, చెంపల మీదుగా జారుతూన్న కన్నీళ్ళ సంగతి తెలియక వీధి అరుగుమీద స్తంభాని జేర్లబడి ఆ మట్టునే వుండిపోయింది సంధ్య.

"ఇక్కడున్నావేం?"

రాజు కర్కశంగా అరిచిన అరుపు తుళ్ళిపడింది.... "ఊ....లోపలికి నడు" గుడ్లురుముతూ అన్నాడు రాజు, అతను వేసిన కేకకి లేడిలా బెదిరిపోయి నిలువెల్లా వొణికిపోయింది.

ఇన్నేళ్ళయినా సంధ్యకి కాఫీ కలపడం రాలేదు. అందువల్ల మామూలుగా రాజే కాఫీ తయారు చేసుకున్నాడు. అతను కలుపు కొన్న కాఫీని, తనచేత్తో ఆమె అందిస్తూన్నప్పుడు సాసరులో కప్పు 'టకటక' లాడుతూ కదిలి చప్పుడైంది. అది చూసి- "ఒణుకుతున్నావా? లేక ఆ పాటకి తాళం వేస్తున్నావా?" అన్నాడు రాజు. ఆ మాట లోని వెటకారం సంధ్యకి అర్థంకాలేదు. అందుకే ఎంతో ఉత్సాహంతో "ఎవరో కాని పాట చాల బాగా పాడుతున్నారు కదాండీ" అంది అమాయకంగా.

"పాట బాగానే ఉంది. కాని నీ పద్ధతే బాగోలేదు" అన్నాడు రాజు.


ఆ మాటకి సంధ్య కళవళపడింది.

"ఏమండీ? ఎందుకలా అన్నారు? నేనేం చేశాను? ఏమైనా తప్పుచేశానా?" అంటూ అడిగింది బెరుకుబెరుగ్గా.

అమాయకమైన సంధ్య ముఖం చూసేసరికి రాజుకి జాలివేసింది. నిజంగా తన సంధ్యది నిష్కళంకమైన మనస్సే? ఉత్త పసిహృదయం. తనకు తెలుసు. అందుకే దగ్గరగా తీసుకుని ముంగురులు దువ్వి, ఆమె తలని తన గుండెలకి అదుము కుంటూ "అది కాదు సంధ్యా! ఎవరో సంగీతం పాడుతుంటే మైమరచి నువ్వు అలా వింటే ఎలా చెప్పు? ఇంకెప్పుడూ అటు చూడకు. అది వినకు. 'ఏం?' అన్నాడు బుజ్జగిస్తూ.

అతని కౌగిలిలో పులకించిపోతూన్న సంధ్య సంతోషంగా గుటకమ్రింగి అతని మాటకి సమాధానం ఏం చెప్పకుండా ఉండిపోయింది.

ఆ రాత్రంతా పరధ్యానంగానే ఉంది సంధ్య. భోజనాలదగ్గర అన్నం వెయ్యమన్నప్పుడు కూరవేసి, మంచినీళ్లు కావాలన్నప్పుడు నేతిగిన్నె దగ్గరగాపెట్టీ, చాలు అంటున్నా మజ్జిగంతా ధారగా కంచం



నిండా పోసేసి, తీసిన తమలపాకులకి బదులు ఈనెలు అందించబోయి రాజుకి చెడ్డ చిరాకు కలిగించింది. ఓ రాత్రివేళ లేచిచూస్తే కుర్చీలో కూర్చుని, మంగళ సూత్రం త్రాటిని కుడిచేత్తోలాగి నాలికతో తాటిస్తూ ఆలోచిస్తూ కనిపించింది సంధ్య.

"ఏవిటీ పరధ్యానం? దేని గురించీ ఈ ఆలోచన?" రాజుకి విసుగేసింది. "ఏవిటా ఆలోచన?" అని కేకెయ్యబోయి కూడా, సిగ్గుల నిగ్గు తేరిన కోలముఖం సీదలు కనిపించే బుగ్గలు, కొన తేరిన ముక్కూ ఎర్రని పెదిమలూ కళాకారుడు అందంగా మలిచిన బంగారపు బొమ్మలా

ముగ్ధమోహనంగా కూర్చుని వున్న భార్య కేసి కన్నార్పకుండా ఆ మట్టునే చూస్తూ ఉండిపోయాడు రాజు.

ఆ తర్వాత ఎప్పుడు పాట వినిపించినా అరుగుమీదకైతే వెళ్ళడం మానేసింది కాని వీధి గుమ్మంలోకో, కిటికీ దగ్గరకో రాకుండా మానడం లేదు. తనను తాను మరచి ఆ పాట వినకుండానూ వుండడం లేదు. ఓ రోజునైతే వీధి తలుపు తీసుకుని గుమ్మంలో నిలబడి పాట పరవశ్యంలో వుండిపోయి. రాజు రావడాన్నే గమనించ లేదు సంధ్య.

ఎవరో పరాయి మగాడు పాడుతూన్న పాటకి తన భార్య ఇలా ఒళ్ళు తెలియకుండా పరవశించి పోవడాన్ని ఆ రోజు సహించలేక పోయాడు రాజు. కోపాన్ని ఆపుకోలేక సంధ్యని లోపలికి తీసుకువచ్చి తలుపు గడియవేసి ఆ లెంపా, ఈ లెంపా వాయిస్తూ "ఏం? ఇంక నుంచైనా చెప్పినట్టు వింటావా? వింటావా?" అంటూ అరిచాడు రాజు.

భర్త తనని ఎందుకు కొడుతున్నాడో అర్థం కాలేదు సంధ్యకి. భార్యని భర్త అలా కొడతాడు కాబోలు. నాన్నగారు అమ్మమీద అప్పుడప్పుడు ఇలాగే చెయ్యి చేసుకొనే వారు కదా! అంతే కాబోలు.... ఆ హక్కు భర్తకి వుందేమో అనుకుంది.

ఏడవకుండా అలా బిత్తరపోయి చూస్తూన్నసంధ్యని చూసేసరికి, రాజు కోపం తారస్థాయిని చేరింది. "ఏం మట్లాడవేం? మాటంచే అంత లెక్కలేదా?" అంటూ మరో రెండు దెబ్బలు వేశాడు. ఆ దెబ్బలకి తట్టుకోలేక చంటిపిల్లలా బావురుమంది సంధ్య. ఆ ఏడుపులో ఏ భావమూ లేదు. ఆమె సమాధానం చెప్పకుండా అలా ఊరికే ఏడ్చిన కొద్దీ రాజులో సహనం తరిగి పోసాగింది. చేతులు నొప్పెట్టేలా ఆమెని కొట్టసాగాడు. కాస్సేపు ఏడ్చి ఏడ్చి గుడ్లు తేలేసి నేలమీదకి ఒరిగిపోయింది సంధ్య.

అది చూసి రాజు కంగారుపడ్డాడు. పడిపోతూన్న సంధ్యని చేతుల్తో పొదివి పట్టుకొని పశ్చాత్తాపంతో 'సంధ్యా! సంధ్యా' అని అరిచాడు. కొద్దిగా కళ్లు తెరిచి మంచినీళ్ళు అంటూ కళ్ళతో సంజ్ఞ చేసింది సంధ్య. నెమ్మదిగా తీసుకెళ్ళి వాలు కుర్చీలో పడుకోబెట్టి గ్లాసుడు నీళ్ళయితే పట్టించాడు రాజు. అవి సగం తాగి ఆ తర్వాత కళ్ళుమూసుకుని ఆ మట్టునే కుర్చీలో ఒరిగిపోయింది సంధ్య.

సంధ్యని ఆ స్థితిలో చూసేసరికి రాజుకి భయం వేసింది. 'సంధ్యా .... సంధ్యా' అంటూ పిలిచాడు. ముఖంమీద నీళ్ళు చిలకరించాడు. "నేను పశువులా ప్రవర్తించాను" అంటూ చేతుల్లో ముఖం పెట్టుకొని తనలో తాను కుమిలిపోయాడు.

ఓ గంట పోయాక సంధ్య నీరసంగా కళ్లు తెరిచి చూసి, రాజు పడుతూన్న వేదనకి కళవళపడిపోయింది. దీనంగా ముఖం పెడుతూ "మీరలా బాధపడకండి .... అంతగా కావలిస్తే నన్ను మళ్లీ కొట్టండి; అంతేకాని మీరలా...." అంటూ కన్నీళ్లు కార్చేసింది. రాజు హృదయం కరిగిపోయింది. దగ్గరగావచ్చి తన వ్రేళ్ళ ఆనమాళ్ళుపడ్డ బుగ్గల్ని ఆప్యాయంగా నిమురుతూ "నావెట్టి సంధ్యా .... నిష్కారణముగా ఎన్ని దెబ్బలు తిన్నావు" అన్నాడు. అతని కంఠంలో గద్గదికతచూసి కంగారు పడిపోయింది సంధ్య. ఆ రాత్రి ఎవరికీ భోజనం సంగతి జ్ఞాపకం రాలేదు. జరిగినదంతా మరచి, అసలీ లోకాన్నే మరిచి, అతని కౌగిట్లో గువ్వలా ఒదిగి. నవ వధువులా ముడుచుకుపోయి నిద్రపోయింది సంధ్య.

మర్నాడు ఉదయం మామూలుగా "అన్నీ పట్టుకువచ్చి అక్కడ పెట్టాను. కాఫీ కలుపుకోండి" అని సంధ్య అంటూ ఉంటే రాజు నిట్టూర్చి "నీ కీ జన్మలో ఇంక కాఫీ కలపడం రాదనుకుంటాను" అన్నాడు. సంధ్య చిన్నబుచ్చుకొని నేల కేసి చూస్తూ వుండిపోయింది. పాలల్లో డికాక్షన్ కలుపుకుంటూ "ఈ పల్లెటూరి విగ్రహాన్ని తీసుకువచ్చి నామెడకి అంటగట్టారు" అని రాజు అంటూన్నప్పుడు సంధ్య జాలిగా అతనికేసి చూపింది. "అమాయకత్వానికి కూడా ఒక హద్దంటూ వుంది. ఇది అమాయకత్వం కాదు. ఘరీ మూర్ఖత్వం" అంటూన్న రాజుకేసి కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ చూపింది సంధ్య.

"ఇటురా" విసుగ్గా అన్నాడు రాజు.

బెదురుతూ దగ్గరగా వచ్చి "ఏమండీ! మళ్ళీ కొడతారా!" అంది సంధ్య.

ఆ మాట రాజు గుండెలమీద ఛెళ్ళున తగిలింది. ఒక్క నిముషం ఊపిరి తీసుకుని బుజ్జగిస్తూన్న ధోరణిలో "మళ్ళీ ఆ పాట వినడానికి అరుగు మీదకే గుమ్మాల దగ్గిరికీ వెళ్ళవుగా" అన్నాడు రాజు.

"వెళ్లను" అన్నట్లు తల అడ్డంగా ఊపింది.

"నోరు ఏమైందీ?" అరిచాడు రాజు.

"వెళ్ళను .... మీరు వద్దన్నారుగా?" అంది.

రాజుకి అరికాలిమంట నెత్తికెక్కింది.

"నేను వెళ్ళొద్దన్నానుకదా అని మానెయ్యడమేకావి, వెళ్ళకూడదని నీకు అనిపించడం లేదన్నమాట! .... హుం! .... ఇదిగో.... నీ కిదే చెప్తున్నాను.... ఈమాటు నువ్వా పాట వినడానికి వెళ్లావో నిన్ను శాశ్వతంగా మీ పుట్టింటికి పంపించనైనా పంపించేస్తాను లేదా కత్తైదైతే నరికెయ్యనైనా నరికేస్తాను."

సంధ్య నిలువెల్లా వణికిపోయింది. తను ఆపాట వినకూడదు. అసలటువైపు వెళ్ళకూడదు.... వెళితే .... వెళితే.... ఆమె హృదయం రావి ఆకులా చలించిపోయినది. రాజు అన్నమాటలు తలుచుకొన్న కొద్దీ భయంతో సంధ్య గజగజలాడిపోసాగింది.

ఆ తర్వాత చాలా రోజులుదాకా వీధి కిటికీ వేసే వుంచింది. రాజుని ఆఫీసుకు పంపించాక వీధి తలుపు గడియవేసి కుర్చీలూ స్టూలూ బట్టలస్టేండూ తన పుట్టింటివాళ్ళిచ్చిన కర్రపెట్టీ అన్నీ ఆ తలుపుకి అడ్డంపెట్టేది. ఆ పాట తనకి ఇంకా ఎక్కడ చెవిలోపడుతుందో అనే భయంతో చెవుల్లో దూదికూడా పెట్టుకొని కూర్చునేది.

కూనిరాగాలు తీసుకుంటూ, ఇంట్లో పనిపాటలు చూసుకుంటూ వెనక పెరట్లో జామిచెట్టుమీది చిలకల్నీ మావిడి గున్న మీద కోకిలనీ పలకరిస్తూ వాటితోపాటు అరుస్తూ వెక్కిరిస్తూ పాడుతూ ముందు పెరట్లో జాజిపువ్వులు కోసుకుంటూ రాజు ఇంట్లోలేని ఆ ఏడెనిమిది గంటలూ ఏడెనిమిది నిముషాలులాగ గడిపేసే సంధ్య కిప్పుడు నిముషం ఒక యుగంలా గడవ సాగింది. ఏం తోచడంలేదు. ఏమీ చెయ్యా బుద్ధి వెయ్యడంలేదు. ప్రతి నిముషం ఆ పాట తన చెవిని ఎక్కడ పడుతుందో అని అదరే-ఏ చప్పుడైనా ఆ పాట ఏమో నని వులిక్కిపడసాగింది సంధ్య. ఒక్కొక్కప్పుడు 'ఫరవాలేదు. ఎక్కడ ఒళ్ళు తెలియకుండా తలుపు తెరుచుకొని వెళ్ళి పోతానో అనే భయంతో తలుపులికి ఈ అడ్డులు అన్నీ పెట్టుకున్నానుగా? ఇవన్నీ అడ్డుగా వుండి నన్ను ఆపుతాయి' అనుకొని స్థిమితపడేది.

ఒకటి రెండుసార్లు తలుపు తియ్యడానికి ఆలస్యం చేసిన భార్యనిచూసి లోపలికి వస్తూనే "తలుపుకి ఈ అడ్డు లేవిటి?" అంటూ విసుక్కున్నాడు రాజు. "ఏం ఇవాళ తల దువ్వుకొని జాజులు పెట్టుకో లేదేం?" అని కోప్పడ్డాడు ఓమాటు. మరోమాటు "రోజు రోజుకీ చిక్కిపోతున్నావు. మీ అమ్మనీ నాన్ననీ చూడాలని బెంగపెట్టుకున్నావా?" అంటూ వేళాకోళం చేశాడు. అతను ఏం అన్నా సమాధానం చెప్పేదికాదు సంధ్య. అమ్మా నాన్నమాట ఎత్తినప్పుడు మాత్రం ఆమె కళ్ళు ఆనందంతో మెరిసేవి.


ఆరోజు "మీ నాన్నగారు వుత్తరం రాశారు; పండగలకి రమ్మని. నాకూ అది వారం కలిసివచ్చి మూడురోజులు శలవలు వచ్చేలాగ వున్నాయి. ఇవాళ ఆరుగంటల బస్సుకి బయలుదేరి మీ ఊరు వెళదాం. అయిదు కాకుండానే నేను ఆఫీసునుంచి వస్తాను. నువ్వు రెడీగా వుండు" అంటూ బుగ్గమీద చిటికవేసి ఆఫీసు వెళ్ళిపోయాడు రాజు.

సంధ్య మనస్సు ఆనందంతో గంతులు వేసింది. ఏవో ఊహల్లో తేలిపో సాగింది. ఐదునిముషాల్లో పెట్టె సర్దేసింది. పెరట్లోకి వెళ్ళి "నేను మా ఊరు వెళుతున్నా నోచ్చ్" అంటూ జామిచెట్టుమీది చిలక్కి చెప్పింది. "కూ....కూ" అని అరిచి కోకిలని మరీమరీ కవ్వించి నవ్వుకొంది.

పుట్టింటికి వెళుతున్నాం అనే సంతోషంలో ఆ రోజు వీధి తలుపుకి గడియలూ అడ్డాలూ పెట్టడం మరిచిపోయింది. ముందు పెరట్లో ఏపుగా పెరిగిన పందిరి నిండా విరగబూసిన సన్నజాజి మొగ్గల్ని ఒడినిండా కోసుకునివచ్చి హాల్లో కుప్పగా పోసింది. జడవేసుకుని నీళ్లుపోసుకుని తనకి ఎంతో ఇష్టమైన తెల్లజరీ చీర కట్టుకొని, బొట్టూ కాటికా పెట్టుకొని కొత్త పెళ్ళి కూతురులా అలంకరించుకొంది.

పెళ్లి అయేవరకూ తనని లాలించి పెంచిన పల్లె గురించి తియ్యగా ఆలోచించుకుంటూ, మధురమైన భావాల్లో తేలిపోతూ సన్నజాజుల్ని మాలగా కడుతోంది సంధ్య. చేతిలో మాలలాగే మనస్సులో ఆలోచనలు కూడా పొడుగ్గా సాగుతున్నాయి. జ్ఞాపకాలపరిమళాలు మనస్సునంతా ఉక్కిరి బిక్కిరి చేసేస్తున్నాయి.

ఆనంద పారవశ్యంతో గుండె బరువెక్కిపోతోంది. మెదడేదో నిద్రలోకి జారిపోతున్నట్లు తేలిగ్గా అయిపోయి తెల్లని మేఘశకలంలా తేలిపోతోంది. జ్ఞాపకాలలో మునిగిపోయిన మనస్సు జ్ఞాపకాలలో తేలిపోతూ అలా అలా తన పల్లె వేపు సాగిపోతోంది.




బంగారపు వరికంకులతో తలలువంచి గాలికి అటూ ఇటూ కదులుతూన్న పంట చేలు.

పక్కనున్న తోటలతో పరిహాసాలాడుతూ గలగలమని నవ్వుతూ ప్రవహించి పోతూన్న పంట కాలవ.

దూరాన ఆకాశసుందరి పెట్టుకొన్న పెద్ద కుంకుమబొట్టులా మెరిసిపోతూ అస్తమించబోతూన్న సూర్యుడు.

గుంపులు గుంపులుగా గూళ్ళకి చేరుకొంటూన్న కొంగలు

ఎక్కడినుంచో ఉండుండి వినిపిస్తూన్న లేగదూడ అరుపు - లక్ష్మీనారాయణస్వామి కోవెలలోంచి మధురంగా వినిపిస్తూన్న గంటలు.

చేను - కాలవ - సూర్యుడు - ఆవు దూడ - గుడి.

అన్నీ ఒక దానితో ఒకటి కలిసిపోతున్నాయి.

అన్నీ ఒక రూపంలోకి, ఒకే ఒక రూపంలోకి కరిగిపోతున్నాయి.

పండిపోయిన జుట్టు - ఎర్రని కుంకుమ బొట్టు - గలగలా వినిపిస్తూన్న నవ్వు - నవ్వుతూ పిలుస్తోంది అమ్మ!

మధురంగా, మంద్రస్వరంలో, వేణుగానంలా, గుండెల్ని పులకింపజేస్తూ విని

పిస్తోంది. ఆ పిలుపు!


అమ్మ పిలుపు!

ఆప్యాయమైన మధుర గానం లాంటి పిలుపు!

సంధ్య అప్రయత్నంగా లేచింది. చేతిలో జాజిమాలతో సహా కదలుదేరింది. కాళ్లు గాలిలో తేలిపోతున్నాయి. కళ్ళు ఆనందంతో వాలిపోతున్నాయి. మనస్సు ఉక్కిరి బిక్కిరి అయిపోతోంది. చేతులు జాపుకుంటూ గాలిలో తేలిపోతూ అలా అలా అలా....

ఎదురుగుండా కన్నుల మూసుకుని తన్మయస్థితిలో మురళి వాయిస్తున్న ముప్ఫయ్యేళ్ల ఆఫీసరు!

సంధ్య కల చెదిరిపోయింది.




గుండె ఆగిపోయింది.

జాజుల వాసనవేసి గాజుల చప్పుడు వినిపించి సమాధిస్థితిలోంచి లేచి కళ్లు తెరిచి చూశాడు ఆఫీసరు.

ఎదురుగుండా తన సంగీతకళకి మెచ్చి సాక్షాత్కరించిన సరస్వతిలాగ, సౌందర్య మూర్తి అయిన స్వరూపం.

ఆఫీసరు పాట ఆగిపోయింది.

సంధ్య ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది.

తన ఎక్కడ ఉన్నదీ అర్థం అయింది.

ఎక్కడనుంచి ఎక్కడికి వచ్చింది తను!

భయంతో గట్టిగా ఒక్క అరుపు అరిచి పిచ్చిగా వెనక్కి పరిగెట్టింది.

జరిగింది ఏమిటో అర్థం కాని ఆ ఆఫీసరు చేతిలో ఉన్న మురళిని పక్కనుంచి లేచాడు. ఆమె వెనకాలే గుమ్మం వరకూ వచ్చాడు. కాని తన గుమ్మం దగ్గరే తలుపు రెక్కలు రెండూ చెరో చేత్తో పట్టుకొని ఆగిపోయాడు.

తుఫాను గాలికి ఊగిపోతూన్న లతలా ఆఫీసరు ఇంట్లోంచి సంధ్య ఇవతలకి పరిగెట్టుకొని వస్తూండగా, అప్పుడే వీధి మలుపులు తిరిగి ఇంటికి చేరుకుంటూన్న రాజు పది గజాల దూరం నుంచి చూసి 'సంధ్యా' అంటూ పిడుగులా గర్జించాడు.

ఆ కేక వింటూనే సంధ్య పైప్రాణాలు పైకి పోయాయి. గుండె ఒక్కమాటు ఆగిపోయింది. రక్తప్రసరణ స్థంభించింది. కళ్లు చీకట్లు కమ్మాయి. కాళ్లు తడబడ్డాయి.

అంతే!

అంత ఎత్తైన మెట్లమీంచి దొర్లి దొర్లి తిన్నగా వచ్చి ఆఖరి మెట్టుమీద ఆగిపోయింది. రాజూ, రాజు వెనకాలే ఆఫీసరూ ఆదుర్దాగా వచ్చి చూశారు. అప్పటికే సంధ్య శ్వాస ఆగిపోయింది. 'సంధ్యా' అంటూ రాజు పిచ్చిగా అరిచాడు. ఆఫీసరు కొయ్యబారి పోయాడు.

ఎందుకిలా జరిగిందో ఆఫీసరుకి అర్థం కాలేదు. కాని ఎక్కడో ఏదో అన్యాయం జరిగిందన్న, ఆవేదనా అశాంతీ-ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా మానసిక శాంతి లభించక నెలకో ఊరు ట్రాన్స్ఫర్ చేయించుకుంటూ ఆ ఆఫీసరు పిచ్చివాడిలా ఊరూరా తిరగ సాగాడు.

ఓ రోజు తను వున్న ఊరునుంచి మసక వెలుతురులో సంధ్యా వాళ్లపుట్టింటి ఊరు మీదుగా మరో ఊరు, బండిమీద కేంప్ వెళుతూ, ఎడ్ల మెడలో మువ్వల చప్పుడికి మురిసిపోయి, ఎన్నాళ్ల నుంచో తియ్యకుండా దాచి వుంచడంవల్ల మూగ వోయిన మురళిని సంచీలోంచి తీసి కళ్ళు మూసుకొని తన్మయస్థితిలో అసావేరి రాగాన్ని ఆలపించసాగాడు.

వెంటనే గాజులు గలగల మన్నాయి.

గాజులు గుప్పుమన్నాయి.

భయంతో నిలువెల్లా కంపించి పోయాడు ఆఫీసరు. ఆ అమ్మాయి చని పోయినా ఆమె ఆత్మ తనని వెన్నాడు తోందా....ఇంక పాడలేక పోయాడు. చేతులు వణుకుతున్నాయి. చేతిలో వున్న వేణువు ప్రాణంతో కదిలినట్లనిపించింది. కెవ్వున అరిచి చటుక్కున దాన్ని బండి లోంచి రోడ్డు ప్రక్కనున్న వెదురు పొద ల్లోకి విసిరేశాడు.

ఆ వేణువు మీద అప్పుడే వుదయిస్తూన్న చంద్రకిరణం ఒకటి పడి, సంధ్య నవ్వులా తళుక్కుమంది. భయంతో గట్టిగా కళ్లు మూసుకున్నాడు ఆఫీసరు.

భయాలకీ బాధలకీ అతీతంగా వేణువు నవ్వుతోంది.

ఆఫీసరు బండి ముందుకు సాగుతోంది బ్రతుకు భారాన్ని ఈడ్చుకుంటూ బరువుగా.

రాజు నవ్వుతున్నాడో, బాధపడుతున్నాడో, ఏకాంత జీవితాన్ని సాగిస్తున్నాడో, ఇంకో భార్యతో కొత్త జీవితాన్నే ప్రారంభించాడో, అసలు జీవించి ఉన్నాడో లేదో కాలానికేం పట్టినట్లు లేదు.

దాని దృష్టి ఎంతసేపటికీ వెన్నెలలో మెరుస్తూన్న వేణువు వైపూ, గతుకుల బాటల్లో నడుస్తూన్న ఆఫీసరు బండివైపూ-

అంతే—

★★★